క్లుప్తంగా

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు సహకరించండి


ఎమ్మెల్యే చిట్టిబాబును కలిసిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు

అంబాజీపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో క్రిస్టియన్ మైనార్టీ వర్గీయులకు కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని వైఎస్సార్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కోరారు. ఎమ్మెల్యే చిట్టిబాబు స్వగృహం నగరంలో శనివారం మర్యాద పూర్వకంగా కలసి వారి సమస్యలను వివరించారు. కమ్యూనిటీ భవనాలతో పాటు శ్మశానవాటికలను నిర్మించాలని కోరినట్లు పాస్టర్లు తెలిపారు. అనంతరం ఇటీవల అంబాజీపేటలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమ్మేళనాన్ని విజయవంతం అయిన సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబును పాస్టర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కుసుమ రత్నం, కె.బాబురావు, ఎల్ సీయోనురాజు, విజయరాజు, రాజారావు పాల్గొన్నారు.

లారీ బోల్తా: త్రుటిలో తప్పిన ప్రమాదం


పాశర్లపూడిబాడవలో తిరగబడిన లారీ

మామిడికుదురు: పాశర్లపూడి బాడవ వైనతేయ వారధి వద్ద శనివారం లారీ బోల్తా పడింది. వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సుకు సైడ్ ఇచ్చేందుకు రోడ్డు ఎడ్జి దిగిన లారీ ఒక్కసారిగా తిరగబడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో ఉన్న డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి. ప్రమాదం నుంచి ఇద్దరూ త్రుటిలో తప్పించుకోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లారీ కోళ్ల మేతతో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నగరం ఎస్సై పి.సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.

చిన్నారులకు టీకాలు


కలవచర్లలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారులు, పి.భవానీశంకర్, డి.మల్లికార్జున, డి.సువర్చలాదేవి, శిరీష ఆధ్వర్యంలో ఆలమూరు–2, కలవచర్ల, పినపళ్ల, సంధిపూడి, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల, మోదుకూరు, నవాబుపేట, మడికి శివారు మల్లావానితోట, మూలస్థాన అగ్రహారం తదితర గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్ హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పర్యవేక్షించారు.

వాకర్ సాయంతో స్వామి సన్నిధికి...


ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న స్వామి–సత్యవతి దంపతులు

సఖినేటిపల్లి: భార్య ఆరోగ్యం కుదుటపడితే రోడ్డు మార్గాన నడిచి వస్తానని మొక్కుకున్నాడు ఓ భక్తుడు. ఒంటి కాలుపై వాకర్ సాయంతో, భార్య ప్రోత్సాహంతో అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి సన్నిధికి చేరి శనివారం మొక్కు తీర్చుకున్నాడు సదరు భక్తుడు. ఈ మేరకు ఆలయంలో స్వామివారి ప్రత్యేక దర్శనం వారిరువురికి ఆలయ సిబ్బంది చేయించారు. 16 రోజుల పాటు రోడ్డు మార్గాన సాగిన స్వామి దర్శన పాదయాత్ర వివరాలిలా ఉన్నాయి. ద్వారకా తిరుమల మండలం తిరునం పాలెంకు చెందిన కుప్పాల స్వామి వాకర్ సాయంతో జీవిస్తున్నాడు. ఇటీవల కాలంలో సతీమణి సత్యవతి అనారోగ్యానికి గురైంది. దీంతో లక్ష్మీనృసింహుని నిత్యం ఆరాధ్య దైవంగా కొలుస్తున్న స్వామి, భార్య ఆరోగ్యం యథాస్థితికి వస్తే రోడ్డు మార్గాన నడిచి వచ్చి మొక్కు చెల్లించుకుంటానని స్వామికి మొరపెట్టుకున్నాడు. ఈ తరుణంలో భార్యకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరడంతో మొక్కు చెల్లించేందుకు 16 రోజుల పాటు వాకర్ సాయంతో నడిచి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసింది. స్వామివారి లడ్డూ ప్రసాదం, చిత్రపటాన్ని వారికి సిబ్బంది అందజేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- నేదునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


నేదునూరు పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: దళారీల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్ముకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం నేదునూరు పీఏసీఎస్‌లో పీఏసీఎస్ చైర్మన్ జోగి బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి వై.శోభ, నేదునూరు పీఏసీఎస్ సీఈఓ గోకరకొండ లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కాకిలేటి శ్రీనివాసరావు, కామన కృష్ణమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, రావూరి వెంకటరామారావు, ఇందుగుల వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష

మామిడికుదురు: ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి ఏ విధమైన సమస్యలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ సూచించారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం ధాన్యం కొనుగోలుపై తహసీల్దార్ పీఏసీఎస్ సీఈఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతుల నుంచి శాంపిల్స్ సేకరించి 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఆర్‌బీకేలకు వచ్చే రైతులకు గోనె సంచులు అందించాలని సూచించారు. గోనె సంచులు తీసుకున్న రైతుల నుంచి విధిగా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బి.మృదుల, ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాస్, డీటీ శరణ్య పాల్గొన్నారు.

అంబాజీపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణలో ఎలాంటి లోపాలు లేకుండా కొనుగోలు కేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ టి.మంగతాయారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్‌లు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్, డెటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్, వీఏఏలకు సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్‌లను పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ ఏడాది నియమించారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సివిల్ సప్లయి అసిస్టెంట్ మేనేజర్ భానుప్రియ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు సక్రమంగా పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఎదురైనా టెక్నికల్ అసిస్టెంట్‌లు సుకన్య, రవీంద్రలు ధాన్యం నాణ్యత, తేమ శాతం పరిశీలించడం, రైస్ మిల్లులకు ధాన్యాన్ని చేరవేసే విధానంపై అవగాహన కల్పించారు.

ఉనికి కోసమే టీడీపీ బీసీ నేతల పాట్లు

అయినవిల్లి: రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యమిచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పార్టీ మండల అధ్యక్షుడు, బీసీ సెల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ (జిజ్జి) అన్నారు. రెండు రోజుల క్రితం మండల టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో బీసీలకు ఒరిగిందేమి లేదని ప్రతికలో ప్రకటనలు విడుదల చేశారన్నారు. దీనిపై శనివారం జిజ్జి ఇంటి వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాస్తవాలను వక్రీకరించి అవాస్తవాలను ప్రచారం చేయడంతో టీడీపీ నాయకులు అరితేరిపోయారని ఆరోపించారు. సీఎం జగన్ నాయకత్వంలో కుల, మత, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ కార్యకర్తలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ కమిషన్ ఏర్పాటు, అసెంబ్లీ స్పీకర్ బీసీకి కేటాయించడం, కేబినెట్‌లో11 మంది బీసీలు మంత్రులుగా ఉన్నారని, రాజ్యసభలో నలుగురు, లోక్‌సభలో ఆరుగురు చొప్పున బీసీలు ఎంపీలుగా ఉన్నారని అన్నారు. ఇక 31 మంది ఎమ్మెల్యేలు, 12 మంది ఎమ్మెల్సీలు, 56 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, 9 మంది జెడ్పీ చైర్మన్లు, 9 మంది మేయర్లు, 215 మంది జెడ్పీటీసీలు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారంటే బీసీలపై జగన్‌కు ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందన్నారు. మీ తెలుగుదేశం హయాంలో పి.గన్నవరం నియోజకవర్గంలో బీసీలకు ఏమాత్రం పదవులు కట్టబెట్టి గౌరవించారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా టీడీపీ నాయకులు కల్ల బొల్లి మాటలు కట్టిపెట్టి, జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురద చల్లడం మానాలని విద్యాసాగర్ హితవు పలికారు. అలాగే వైఎస్సార్ సీపీకి చెందిన బీసీ నాయకులు కుడుపూడి రామకృష్ణ, కర్రి బాల సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి శ్రీను, కామన కృష్ణమూర్తి మాట్లాడుతూ బీసీలకు మాజీ సీఎం చంద్రబాబు వల్ల ఏం న్యాయం జరిగిందో టీడీపీ నేతలు చెప్పాలన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయాలు


కోలాటం నిర్వహిస్తున్న బృందం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులోని కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కూడా భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో కోలాటం ఏర్పాటు చేశారు.

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామిని శనివారం భక్తులు దర్శించుకున్నారు. ఏడు వారాలు దర్శించుకుంటే శుభం కలుగుతుందనే నమ్మకంతో భక్తులతో ఆలయం పోటెత్తింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మలికిపురం: ఉద్యమాలను ఉధృతం చేసి విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణను అడ్డుకుందామని విద్యార్థులకు, యువతకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం పిలుపునిచ్చారు. స్థానిక పూలే, అంబేడ్కర్ భవనంలో శనివారం పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్‌ను భూషణం ఆవిష్కరించారు. అనంతరం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కర్మాగారానికి ముడి సరుకు అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నప్పటికీ, విశాఖ ఉక్కు కర్మాగారం అనేక లాభాలు గడిస్తోందన్నారు. మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, పీడీఎస్‌యూ జిల్లా కన్వీనర్ ఎస్.రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎంతోనే సాధ్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వెలిచేరులో గడప గడపకూ..


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ అమలు చేస్తున్నది కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని, పని చేస్తున్నాం కాబట్టే ఎలాంటి మాయ మాటలు చెప్పకుండా నిజాయితీగా ప్రజల్లో ధైర్యంగా చేసిన పనిని చెప్పగలుగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండలం వెలిచేరులో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ సీనియర్ నాయకులు కునాథరాజు రంగరాజు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ వేముల వెంకన్నబాబు, మాజీ ఎంపీటీసీ వేముల రామన్న, అద్దంకి అరుణ్‌కుమార్, పోసింశెట్టి కోటయ్య ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తుంటే అడుగడుగునా అవ్వా తాతల ఆశీర్వాదాలు, ఆడపడుచుల అభిమానం, రైతన్నల ఆనందంతో వెలిచేరులో ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాగా పని చేస్తున్నారని పథకాలన్నీ చక్కగా అందుతున్నాయని లబ్ధిదారులు చెప్పారు. గ్రామంలో 95 ఏళ్ల అవ్వ నాకు ఎవరూ లేరు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.2750 పింఛన్, 5 కేజీల బియ్యం ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది అంటూ ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఆశీర్వదించింది. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యాంసన్, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

రాజోలు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి మాదిగ జాతి కృషి చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. శనివారం చింతలపల్లిలోని కొత్తకాలనీలో మాదిగ సామాజికవర్గ సంఘ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రాజ్యాంగ పదవులు కేటాయించారన్నారు. రాజకీయంగా, సామాజికంగా చిన్న చిన్న సామాజిక వర్గాలను గుర్తించిన సీఎం జగన్ రుణాన్ని తీర్చుకోవాలన్నారు. సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కనపాల బాబూరావు, నాయకులు మట్టా సురేష్, చేట్ల సత్యనారాయణ, తెన్నేటి నాగేశ్వరరావు, మంద రవి, ఉల్లంపల్లి రమేష్, తెన్నేటి అశోక్, సీహెచ్ సుధాకర్, తెన్నేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి రూ.12 వేల ఆర్థిక సాయం

తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద రవికుమార్ భార్యకు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అందజేశారు. ప్రభుత్వం పరంగా చికిత్స కోసం సహకారం అందించేందుకు కృషి చేస్తామని రవికుమార్‌ను ఓదార్చారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి


గృహనిర్మాణ ప్రగతిని సభ్యులకు వివరిస్తున్న హౌసింగ్ ఏఈ సత్యనారాయణ

రాజోలు: గ్రామాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని రాజోలు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా శ్రీనివాస్ అన్నారు. శనివారం రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ, ఇరిగేషన్, వైద్యం, ఐసీడీఎస్, గృహనిర్మాణం తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను అధికారులు సభ్యులకు వివరించారు. జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అలాగే పలు అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. పంట కాలువల్లో పెరిగిపోతున్న పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని రైతులు శ్రమదానంతో తొలగించుకుంటున్నారని ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని శివకోడు సర్పంచ్ నక్కా రామారావు అధికారులను ప్రశ్నించారు. అలాగే మండలంలో పలు కాలనీలు లోతట్టుగా ఉన్నాయని వాటిని మెరక చేసే పనులు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, ఏఓ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడు శర్మ దంపతులకు ఘన సన్మానం


వాడపాలెంలో రామచంద్రశర్మ–ఆదిలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ భక్తులు

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో వేంచేసిన అయ్యప్ప స్వామి జ్ఞాన సరస్వతీదేవి ఆలయ అర్చకుడు దొంతికుర్తి రామచంద్ర శర్మ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యాన శనివారం ఘన సత్కారం జరిగింది. అర్చకుడు రామచంద్ర శర్మ 2017 నుంచి వాడపాలెం అయ్యప్ప స్వామి జ్ఞాన సరస్వతి దేవి ఆలయ అర్చకుడిగా సేవ చేస్తున్నారు. ప్రస్తుతం అయ్యప్ప స్వామి మండల దీక్ష కార్యక్రమాల నేపథ్యంలో ఆలయ కమిటీ, అయ్యప్ప మండల దీక్ష చేపట్టిన భక్తులు, గ్రామ పెద్దలు శనివారం మధ్యాహ్నం భిక్ష సమయంలో రామచంద్ర శర్మ–ఆదిలక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలు, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అనంతరం శర్మ దంపతులు సుమారు 300 మంది భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం పండ్లు పంచామృతాలతో ప్రత్యేకంగా తయారు చేసి స్వామికి నివేదించిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బండారు బుల్లి తాత, ఆలయ ఇన్‌చార్జి మట్ట బాబ్జీ, కమిటీ సభ్యులు పెదపూడి శ్రీనివాస్ వరగన వరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటు నమోదు చేయించుకోవాలి


ఈతకోటలో ఓటు హక్కుకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో ముక్కంటి


మామిడికుదురులో కొత్త ఓటుకు దరఖాస్తు తీసుకుంటున్న తహసీల్దార్ హుస్సేన్

కొత్తపేట: కొత్త ఓట్ల నమోదుకు, మార్పులు చేర్పులకు సంబంధించి స్పెషల్ క్యాంపెయిన్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట ఆర్‌డీఓ, ఎన్నికల అధికారి ఎం.ముక్కంటి కోరారు. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2002లో భాగంగా ఈనెల 4, 5 తేదీలు, వచ్చే నెల రెండు మూడు తేదీల్లో పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం నియోజవర్గ పరిధిలో ఆర్డీవో, ఆర్వో ముక్కంటి ఆధ్వర్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు కొత్త ఓట్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం 6, 7, 8 స్వీకరించారు. నియోజవర్గంలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ముక్కంటి పరిశీలించారు. స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహణ తీరుతెన్నులను గురించి బీఎల్వోలు, సూపర్‌వైజర్లను ఆరా తీశారు. ఇదే విధంగా ఆదివారం, వచ్చే నెల రెండు, మూడు తేదీల్లో కూడా నిర్వహించాలని సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో బీఎల్వోలు విధులకు హాజరయ్యారా లేదా, సూపర్వైజర్ల పర్యవేక్షణను కూడా ఆరా తీశారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: అర్హత కలిగిన వారు తమ సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ సూచించారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో శనివారం పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓటర్ల నమోదుకు డిసెంబర్ 9వ తేదీ వరకు సమయం ఉందన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలో 62 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని చెప్పారు. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో 43, రాజోలు నియోజకవర్గ పరిధిలో 19 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం మండలంలో 54,551 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వారిలో పురుషులు 27,456 మంది, మహిళలు 27,095 మంది ఉన్నారన్నారు. ఆయన వెంట డీటీ శరణ్య, ఆర్ఐ అలీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని 60 పోలింగ్ స్టేషన్ల వద్ద శనివారం ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించారు. కొత్త ఓట్ల నమోదు కోసం 93 దరఖాస్తులు, మరణించిన ఓటర్లు, వాటిలో డబుల్ ఎంట్రీల తొలగింపుల కోసం 123, ఓటర్ల జాబితాలో మార్పుల కోసం 27 దరఖాస్తులు అందాయి. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఆర్ఐ పి.నర్సింహరావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ స్వామీజీ రావులు ఈ శిబిరాలను పరిశీలించారు.

అంబాజీపేట: మండలంలో నిర్వహిస్తున్న ఓటు నమోదు క్యాంపెయిన్ డేను ప్రతి ఒక్కరూ వినియోగించకోవాలని తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అధికారులు అందుబాటులో ఉంటున్న దృష్ట్యా కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు, అలాగే సవరణ, తొలగింపు వంటి వాటి కోసం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలన్నారు. చిరునామా మార్పు, డబుల్ ఎంట్రీ, ఓటరు తమ ఓటు జాబితాలో ఉన్నదీ లేనిది చూసేందుకు ఓటరు జాబితా పరిశీలన చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు ఆయా బూత్‌ల పరిధిలో అందుబాటులో ఉంటారన్నారు. ఆదివారం కూడా స్పెషల్ క్యాంపెయిన్ డే జరుగుతుందన్నారు.

వైభవంగా వాసవీ మాత జాతర


అంబాజీపేటలో అమ్మవారి రూపాలతో నృత్యం చేస్తున్న కళాకారులు

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంబాజీపేటలో జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు కోనసీమ ప్రాంతంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన సందర్శకులతో అంబాజీపేట సెంటర్ కిటకిటలాడింది. కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి వాహనం ఊరేగించారు. కేరళ వాయిద్యాలతో, వివిధ అమ్మవార్ల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. మేళతాళాలతో యువకుల కేరింతలతో, బాణసంచాతో ఉత్సాహంగా జాతర నిర్వహించారు. సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో వాసవీ వైశ్య సంఘ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి


బూల మధు (ఫైల్)

పి.గన్నవరం: మండలంలోని పోతవరంలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న బూల మధు (31) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న మధు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మధుకు భార్య ఉన్నారు. మృతుని కుటుంబాన్ని మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు మోకా శ్రీను, జిత్తుగ విజయ్ ప్రసాద్ తదితరులు పరామర్శించారు.

చెకుముకి సంబరాల పోస్టర్ ఆవిష్కరణ


చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

మలికిపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించే దిశగా ప్రయత్నిస్తున్న జనవిజ్ఞాన వేదిక ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను శనివారం మండల వనరుల కేంద్రంలో ఎంఈవోలు విజయశ్రీ, వైవీ సత్యనారాయణలు ఆవిష్కరించారు. కాగా షెడ్యూల్ విడులైందని, అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, టీచర్లు చెకుముకి సైన్స్ సంబరాలకు తమ, తమ స్కూళ్లలోని 8, 9, 10 తరగతి విద్యార్థులందరూ హాజరయ్యేటట్టు చూడాలని వేదిక మండల అధ్యక్షుడు పీవీ వరప్రసాద్, చెకుముకి కో ఆర్డినేటర్ సీహెచ్ తులసీరావు కోరారు. అలాగే విద్యార్థులు ప్రోత్సాహానికి తగిన చర్యలు చేపట్టాలని కూడా వారు కోరారు.

108లో ప్రసవం


ప్రసవించిన బిడ్డతో తల్లి, 108 సిబ్బంది

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో ఓ మహిళ 108 అంబులెన్సులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. స్థానిక నవాబుపేట రోడ్డులోని ఇటుక బట్టీలో పని చేస్తున్న బి.గీత నిండు గర్భిణి. శనివారం హఠాత్తుగా పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే 108 అంబులెన్స్ అక్కడకు చేరుకుంది. సమీప పీహెచ్‌సీకి తీసుకువెళ్తుండగా.. గీతకు నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఈఎంటీ భారతి, పైలట్ ఎస్.రాజేష్‌లు వెంటనే వైద్యాధికారి డి.సువర్చలా దేవికి పరిస్థితిని వివరించారు. ఆమె సూచనలు, సలహాలకు అనుగుణంగా గీతకు ప్రసవం చేశారు. దీంతో ఆమె మూడో కాన్పులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం


వెలిచేరులో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరులో ఇటీవల మృతి చెందిన ఇర్లపాటి నాగేంద్ర, చిలువూరి వరప్రసాద్ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి రూ.10, రూ.5 వేలు సాయం అందించారు. వారి కుటుంబ సభ్యులకు తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.